# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీఅఖిల్ మహాజన్

- నామినేషన్లకు సర్వం సిద్ధం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఎస్పీ అఖిల్ మహాజన్

కలెక్టరేట్, నవంబర్ 3: రాజన్నసిరిసిల్ల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించనున్నామని, ఇందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. శుక్రవారం ఎన్నికల సంఘం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీతో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్‌ల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథంతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి 10 వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. 13న నామినేషన్ల స్క్రూటినీ, 15వ తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారన్నారు. ఈ నెల 30న పోలింగ్,. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారని వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ఫెసిలిటేషన్ సెంటర్, నామినేషన్‌ను పత్రాలు అందించే కౌంటర్లు, సెక్యూరిటీ డిపాజిట్ కౌంటర్లు, కంట్రోల్‌రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు వారి నామినేషన్ పత్రాలను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అప్లికేషన్ సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి కాపీలను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఒక రోజు ముందే అభ్యర్థి తన పేరున ఎన్నికల ఖర్చు కోసం కొత్తగా బ్యాంకు ఖాతాను ప్రారంభించి వివరాలను ఆర్వో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒక ప్రతిపాదకుడిని, ఇండిపెండెంట్లు, రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు పది మంది ప్రతిపాదకుల సంతకాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతిపాదకులు సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఓటర్లయి ఉండాలని చెప్పారు. ప్రతిపాదకులు నిరక్షరాస్యులైన పక్షంలో ఆర్వో సమక్షంలోనే వేలిముద్ర వేయాల్సి ఉంటుందన్నారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్‌తోపాటు కులధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ధ్రువపత్రాలు అందుబాటులో లేకుంటే స్క్రూటినీ సమయానికి ఆర్వో కార్యాలయంలో వాటిని అందజేయాలని తెలిపారు. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ అభ్యర్థులు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలన్నారు.

**పటిష్ట బందోబస్తు: ఎస్పీ**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, ప్రలోభపరిచే వస్తువులు సరఫరా కాకుండా జిల్లా సరిహద్దుల్లో 7 చెక్‌పోస్టులు, 5 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ నామినేషన్ల కేంద్రాల వద్ద 100 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రెండు బీఎస్ఎఫ్ కంపెనీల 200 మంది సాయుధ బలగాలు రాగా త్వరలో మరో 4 కంపెనీల సాయుధ బలగాలు రానున్నాయని తెలిపారు.

**కేంద్రాల్లో వసతులు కల్పించాలి**

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన కనీస వసతులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని 547 పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి వసతులపై నివేదిక సమర్పించారన్నారు. 198 పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా లేవని తెలిపారన్నారు. 198 పోలింగ్ కేంద్రాల్లో 157 పోలింగ్ కేంద్రాల వసతులను మెరుగుపర్చామని అధికారులు జిల్లా ఎన్నికల అధికారికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీనివాస్, డీఈవో రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు అన్వేశ్, మీర్జాఫసత్‌అలీబేగ్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



అంజయ్యగౌడ్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల

సిరిసిల్ల రూరల్, నవంబర్ 3: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లిలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త, గీతకార్మికుడు అంజయ్య గౌడ్ కుటుంబానికి పార్టీ బీమా చెక్కు రూ.2లక్షలు అందించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపల్లి సరస్వతి, సర్పంచ్ ఆనందరావు , ఎంపీటీసీ బైరినేని రాము, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కనకరాజుగౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వలికొండ వేణుగోపాల్‌రావు, సర్పంచులు కస్తూరి తిరుపతిరెడ్డి, అవినాశ్‌రెడ్డి, ఎంపీటీసీ కోడి అంతయ్య, పడిగెల రాజు, పూర్మాని రామలింగారెడ్డి, మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ షాగ దేవేందర్, మల్లయ్య, ఏనుగు రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు

## శాంతియుత ఎన్నికల నిర్వహణకే కవాతు

ఇల్లంతకుంట : నవంబర్ 3 : రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికే పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రేపాక, సోమారంపేట్, గొల్లపల్లి, వెంకట్రావుపల్లి, పెద్దలింగాపూర్, రామోజిపేట లో జిల్లా బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు ప్రత్యేక విధులు నిర్వహిస్తాయని, ఓటర్లు భయపడకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఇక్కడ ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌కు శ్రీగాధ ముదిరాజ్‌ల మద్దతు



ముదిరాజ్‌ల సమ్మేళనంలో మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

గంభీరావుపేట, నవంబర్ 3: శ్రీగాధ ముదిరాజ్‌లు బీఆర్ఎస్ సిరిసిల్ల అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు ఏకగ్రీవంగా మద్దతు తెలుపడం అభినందనీయమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు కొనియాడారు. శ్రీగాధలో శుక్రవారం ముదిరాజ్‌లు ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హన్మాండ్లు హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో కేటీఆర్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందుకు నిదర్శనమే మామిళ్ల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్, బిత్తిరి సత్తి, ఎర్ర మహేశ్, చంద్రశేఖర్ లాంటి నేతలు బీఆర్ఎస్‌లో చేరారన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పర్శ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రవి, కార్యదర్శి చంద్రయ్య, సభ్యులు నారాయణ, పోచయ్య, నర్సింహులు, రేణుక, నర్సవ్వ, ఎల్లవ్వ, రాజవ్వ, లావణ్య, సుజాత, భాగ్య, రాధ, లత, యూత్ అధ్యక్షుడు మహేశ్ ఉన్నారు.

## ఎన్నికల ప్రచార ఖర్చు నమోదు చేయాలి

- జిల్లాఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి
- నోడల్ అధికారులు, సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులతో సమావేశం



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి

కలెక్టరేట్, నవంబర్ 3: జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చుల వివరాలను పరిశీలన బృందాలు కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి ఆదేశించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి, ప్రత్యేకాధికారి, మీడియా, ఎక్సైజ్, ఆదాయ పన్ను అధికారులు, సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ శాసనసభ నియోజకవర్గాలకు జరుగనున్న ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వీఎస్టీ, వీవీటీలు నమోదు చేయాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలను వీడియో సర్వైలెన్స్ టీమ్ సభ్యులు రికార్డింగ్ చేసి అకౌంటింగ్ టీమ్ సభ్యులకు అందించాలన్నారు. అకౌంటింగ్ టీమ్ సభ్యుల వివరాలను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినపుడు ప్రింటర్, ప్రచురణకర్తలు ఎన్నికల ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 నిబంధనలు పాటించాలని సూచించారు. ఇన్‌కమ్‌టాక్స్, వాణిజ్య పన్నుల శాఖ వ్యయ పరిశీలన శాఖలు ఎన్నికల వ్యయం నమోదులో సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులైనా 89771 24147 సెల్ నంబర్‌కు లేదా పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కు వచ్చి తెలుపాలన్నారు. ఇక్కడ వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేకాధికారి స్వప్న, మీడియా నోడల్ అధికారి మామిండ్ల దశరథం, ఎక్సైజ్ నోడల్ అధికారి పంచాక్షరి, ఆదాయపన్ను నోడల్ అధికారి లాలూన్, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్‌కు మద్దతుల వెల్లువ



కేసీఆర్ నగర్‌లో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న కాలనీవాసులు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 3: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్‌లోని గౌడ, యాదవ సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి తరలివచ్చి సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సమక్షంలో మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గజభీంకార్ రాజన్న, మాజీ సర్పంచ్ పొన్నం లక్ష్మణ్‌గౌడ్, పొన్నం మంజుల, ఎంపీటీసీ కోడి అంతయ్య, చీమల ప్రశాంత్ యాదవ్, గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం తిరుపతి, తాళ్ల శ్రీనివాస్, దేవదాస్, గున్నాల రాములు, యాదవ సంఘం అధ్యక్షుడు కనకయ్య, బాలయ్య, లచ్చయ్య, రేణుక , బాలవ్వ, ఎల్లవ్వ ఉన్నారు.

**కేసీఆర్‌నగర్ వాసుల మద్దతు**

తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో కేసీఆర్ నగర్‌కాలనీ వాసులు మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దుతు తెలిపారు. శుక్రవారం కేసీఆర్ నగర్‌లో టీపీటీడీసీ చైర్మన్ గూడూరు ప్రవీణ్, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ పార్టీ నేతలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను బీఆర్ఎస్ నేతలు అభినందించారు. ఇక్కడ కేడీసీసీబీ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, కట్ట రవికుమార్, సత్య, సొసైటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## వరి వంగడాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పొత్తూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు

ఇల్లంతకుంట : నవంబర్ 3 : పొత్తూరు గ్రామానికి చెందిన చెరుకు రవీందర్ రెడ్డి అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో రుచి దశలో ఉన్న వరి వంగడాలను జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రూపొందించిన దొడ్డు గింజ రకం వరి వండగాలైన జేజీఎల్ 28639, డబ్ల్యూజీఎస్ 1573, ఆర్ఎన్ఆర్ 31479 రకాలను రుచి దశలో ఉండగా పరిశీలించామన్నారు. వ్యవ్యసాయ విశ్వ విద్యాలయం రూపొందించిన వంగడాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వంగడాల ద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సతీశ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గౌన్యా నాయక్, డాక్టర్ శ్రీధర్ సిద్ధి, డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఏఈవో లతాశ్రీతోపాటు రైతులు ఉన్నారు.

## ప్రింటింగ్ యజమానులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

కలెక్టరేట్, నవంబర్ 3: జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, 127(ఏ) సెక్షన్ ప్రకారం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు లోబడి ఎన్నికల ప్రచార కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ప్రింట్ చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ చెప్పారు. శుక్రవారం జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సమావేశమై మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేకాధికారి స్వప్న, మీడియా నోడల్ అధికారి మామిండ్ల దశరథం పాల్గొన్నారు.